క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో నిలబడి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీ నాయకుడు షేర్‌సింగ్ యోగి ఆధ్వర్యంలో నాయకులు బాలాజీ, సంజు, మహదేవ్, బండప్ప కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



కందుకూరు చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఆశవర్కర్లు

కందుకూరు: హైదరాబాద్‌లో ఆశవర్కర్లపై పోలీసులు జరిపిన దాడిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశవర్కర్లు మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్లకు నెలకు రూ.18వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వారి సమస్యల పరిష్కారం కోరుతూ వివిధ రూపాల్లో శాంతియుతంగా పోరాటం చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు అండాలు, శ్రీలత, మాధవి, మంజుల, అనిత, అనురాధ, రేణుక, యాదమ్మ, సురేఖ, లావణ్య, సుశీల, విజయ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ యుగేందర్‌గౌడ్, గ్రామస్తులు

కందుకూరు: మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ కృషితో సీసీరోడ్ల నిర్మాణాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందూరి యుగేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దాసర్లపల్లిలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామస్తుల తరఫున కేఎల్‌ఆర్‌తో పాటు ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మీగడి శేఖర్, నల్లి యాదయ్య, బాల్‌రాజ్, విష్ణు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులకు బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజ్‌కుమార్, కరుణాకర్, రాజేందర్‌రెడ్డి, ఐలేశ్, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గడువు ముంచుకొస్తోంది

- ఎల్ఆర్ఎస్ చెల్లింపులో 25 శాతం రాయితీ
- విస్తృత ప్రచారం కల్పిస్తున్న పుర అధికారులు
- ఈ నెల 31 లోపు వినియోగించుకోవాలని సూచన

తుక్కుగూడ: లే అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) ప్రక్రియ ఈనెల 31లోపు పూర్తి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పురపాలిక అధికారులు చర్యలు చేపట్టారు. గడువులోగా ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ కల్పిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి రాయితీ పొందడంపై అధికారులు దరఖాస్తుదారులకు అవగాహన కల్పిస్తున్నారు. స్వయంగా అర్జీదారులకు ఫోన్ చేసి ఫీజు చెల్లించాలని కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు వార్డు ఆఫీసర్లకు ఈ బాధ్యతలు అప్పగించగా.. వారు ఫీజు వసూలుపై దృష్టి సారించారు. దరఖాస్తుదారులకు ఫోన్ చేసి ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకొని, రాయితీని సద్వినియోగం చేసుకోవాలని విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.



తుక్కుగూడ పుర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ సహాయ కేంద్రం

రూ.2 కోట్లకు పైగా వసూలు

తుక్కుగూడ మున్సిపాలిటీ వ్యాప్తంగా ప్లాట్ల క్రమబద్ధీకరణ కింద 2020లో 2,722 ప్లాట్లకు దరఖాస్తు చేశారు. ఇందులో క్లియర్‌గా 2080 ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ దరఖాస్తులు పరిశీలిన ప్రక్రియ నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చర్యలు తీసుకొంది. వార్డు అధికారులు, ఇతర సిబ్బంది దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తూ 25 ఫీజు రాయితీపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 277 ప్లాట్లుకు ఎల్ఆర్ఎస్ ఫీజును రూ.2.9 కోట్లు వసూలు చేశారు.

సహాయ కేంద్రం ఏర్పాటు

ఎల్ఆర్ఎస్ చెల్లింపుపై ప్రజలకు సందేహాలు తీర్చడానికి పుర కార్యాలయంలో అధికారులు హెల్ప్‌డెస్క్(సహాయ కేంద్రం) ఏర్పాటు చేశారు. ఫీజు చెల్లింపుపై వచ్చే వారికి ఈ కేంద్రం ద్వారా సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఇంకా పుర వ్యాప్తంగా ఉన్న 1853 ప్లాట్లకు ఫీజు చెల్లించాలి. ఈనెల 31 వరకు ఎంత మంది చెల్లిస్తారో వేచి చూడాలి.

అవగాహన కల్పిస్తున్నాం



ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ చెల్లింపులో ఉన్న ఫీజుపై ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇస్తుంది. ఈ విషయంపై తాము ప్లాట్ల యాజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. అవకాశం ఉన్న వారు ఈనెల 31 లోపు ఫీజు చెల్లించి రాయితీ పొందాలి.

– ఏ.వాణి, కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ



మాట్లాడుతున్న పాండుయాదవ్

అర్హులందరికీ రుణాలు అందిస్తాం

పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్

మహేశ్వరం: అర్హత కలిగిన ప్రతీ రైతుకు సహకార సంఘం నుంచి రుణాలు అందించి వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లు, అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘంలో సభ్యులుగా ఉండి అర్హత కలిగిన రైతులకు సహకార బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను తక్కువ వడ్డీకి అందిస్తున్నామన్నారు. గతంలో అప్పుల ఊబిలో ఉన్న మహేశ్వరం పీఏసీఎస్ కార్యాలయం తమ కార్యవర్గం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి లాభాల్లోకి తీసుకొచ్చామన్నారు. సకాలంలో రుణాలు వసూలు చేసి సంఘం బలోపేతం కోసం కృషి చేస్తున్నామన్నారు. సహకార సంఘం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎరువులు, విత్తనాల విక్రయాలను చేపట్టి రైతులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. అంతకుముందు డైరెక్టర్లు చైర్మన్, సీఈఓతో మాట్లాడి రైతు రుణాలు, రికవరీల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ షఫీ, డైరెక్టర్లు రాకేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పాల్కం బాలయ్య, నర్సింహా, ప్రభాకర్, జంగయ్య, విజయమ్మ, లక్ష్మమ్మ రైతులు పాల్గొన్నారు.

‘పన్నులు తగ్గించేవరకు పోరాటం’



రిలే నిరాహారదీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మీర్‌పేట: ప్రభుత్వం స్పందించి మీర్‌పేటలో అధిక ఇంటి పన్నులు తగ్గించేవరకు బీజేపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లెలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పన్నుల భారం తగ్గించాలని ఇదివరకే జిల్లా కలెక్టర్, సీడీఎంఏ, కార్పొరేషన్ కమిషనర్‌లకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి తెలిసేలా దీక్షకు ప్రతి ఇంటి నుంచి ఒకరు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి పన్నులను తగ్గించాలని గత ఐదేళ్లలో కౌన్సిల్ సమావేశాల్లో చర్చించడంతో పాటు సమావేశాన్ని బహిష్కరించి ధర్నాలు చేయగా, అప్పటి ప్రజాప్రతినిధులు తగ్గిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. బీజేపీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని, గృహ నిర్బంధాలు, అరెస్టులు చేసినా పోరాటం ఆగదన్నారు. అనంతరం దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు సూల ప్రభాకర్, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, గడ్డం జగన్, సిద్దాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు మల్లేశ్ ముదిరాజ్, భీంరాజ్, గౌరీశంకర్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం

మాల్ పశువుల సంతకు ఆదాయం దండిగా ఉన్నా సౌకర్యాల కల్పన కొరవడింది. దీంతో అక్కడికి క్రయవిక్రయాల కోసం వచ్చే వ్యాపారులు, రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



ఎండలో ఉన్న ఆవు, దూడ



మాల్ సంతలో క్రయవిక్రయాలు

- రూ.82 లక్షలు దాటిన మాల్ పశువుల సంత నిర్వహణ వేలం
- శాశ్వత స్థలం, సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు

యాచారం: మాల్ పశువుల సంతకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు చెందిన రైతులు, పశు పోషకులు ఈ సంతకు వచ్చి పాడిపశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాల క్రయవిక్రయాలు జరుపుతుంటారు. ప్రతి మంగళవారం నిర్వహించే అంగడిలో దాదాపు 500 మందికి పైగానే వ్యాపారులు జీవనోపాధి పొందుతారు. ఈ పరిణామాలతో పశువుల సంత నిర్వహణ వేలంకు భలే డిమాండ్ ఏర్పడింది. రూ.లక్షలు వెచ్చించి మరి వ్యాపారులు పోటీ పడుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీకి గణనీయంగా ఆదాయం సమకూరుతోంది.

పెరిగిన రూ.29 లక్షలు

వేలంలో సంత బాధ్యతలు దక్కించుకున్న వ్యాపారులు ఏడాది పాటు నిర్వహణ చేపట్టాలి. అంగడిలో క్రయ, విక్రయాలకు వచ్చే పాడి, పశువులు, ఎద్దులు, ఆవులు, గొర్రెలు, మేకలకు రూ.100 నుంచి 500ల వరకు నిర్వహణ చార్జీలు వసూల్ చేస్తారు. ఐదేళ్లలో ఆదాయం బాగా పెరిగింది. ఇది వరకు రూ.53 లక్షలున్న ఆదాయం ఈ ఏడాది రూ.82 లక్షలు దాటింది. ఈ సంత నిర్వహణతో వచ్చే ఆర్థిక వనరులతో గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లిస్తారు.

ప్రైవేట్ వెంచర్‌లో నిర్వహణ

మాల్ పశువుల సంతకు గణనీయమైన ఆదాయమున్నా సరైన సౌకర్యాల కొరత మాత్రం వేధిస్తోంది. ప్రతి ఏడాది రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా అంగడి నిర్వహణకు శాశ్వత స్థలం లేదు. గతంలోని పంచాయతీ పాలకవర్గం సంతకు ఎకరా స్థలాన్ని కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ జాగ చుట్టూ నివాసాలు వెలియడంతో సంత నిర్వహణ కష్టంగా మారింది. దీంతో ప్రైవేట్ వెంచర్లలో అంగడిని నిర్వహిస్తున్నారు. మాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 647లో 16 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 5 ఎకరాలను సంతకు కేటాయించాలని కొన్నేళ్లుగా స్థానికులు ప్రాధేయపడుతున్నా అధికారుల్లో చలనం లేదు. వెంచర్లలో ఏటా ఇంటి నిర్మాణాలతో సంత నిర్వహణ పంచాయతీకి భారంగానే మారే అవకాశం లేకపోలేదు.

ఐదేళ్లలో వేలం ద్వారా వచ్చిన ఆదాయం	
ఏడాది	రూ.లక్షల్లో
2021–22	రూ.53
2022–23	రూ.59
2023–24	రూ.71
2024–25	రూ.73
2025–26	రూ.82

ఎండ, వానకు ఇబ్బంది



మాల్ పశువుల సంతకు ప్రతి మంగళవారం వెళ్తుంటాను. అక్కడ సౌకర్యాలు లేవు. ఎండ, వానకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. రైతుల వద్ద పశువులు, పాడి గేదెలు, మేకలు, గొర్రెలు కొనుగోలు చేసి సంతలో విక్రయిస్తాను. కానీ అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో పశువులు గోస తీస్తాయి.

– మల్లేశ్, వ్యాపారి, మొండిగౌరెల్లి

శాశ్వత స్థలం లేదు



ఉమ్మడి రంగారెడ్డి–నల్గొండ జిల్లాల్లో మాల్ పశువుల సంతకు పేరుంది. ఇక్కడ అనువైన ధరలకు అరకదున్నె ఎద్దులు, కాడెద్దులు, పాడి పశువులు క్రయ, విక్రయాలు జరుపుతారు. గణనీయమైన ఆదాయం పెరుగుతున్నా శాశ్వత స్థలం లేకపోవడంతో నిర్వహణదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– రాంరెడ్డి, రైతు, తమ్మలోనిగూడ

నివేదిక అందజేశాం



మాల్ పశువుల సంతకు శాశ్వత స్థలం కేటాయింపు కోసం సర్వేనంబరు 647లోని 16 ఎకరాల ప్రభుత్వ భూమిలో 5 ఎకరాల కేటాయించేలా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఐదు ఎకరాలు కేటాయిస్తే పశువుల సంతతో పాటు చేపలు, చికెన్, మటన్ మార్కెట్లు ఏర్పాటు చేస్తాం.

– శ్రీలత, ఎంపీఓ, యాచారం

వీఓఏల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న వీఓఏలు

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ వీఓఏలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లకుండా మండల పరిధిలోని వీఓఏలను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేసి పీఎస్‌కు తరలించారు. పోలీసుల అదుపులో వీఓఏలు పద్మ, సునీత, రమ్య, సౌమ్య, మాధవి, మంజుల తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ మాట్లాడుతూ.. వీఓఏల అరెస్టులను ఖండించారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా పోరాటం చేసేవారిని అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను మంగళవారం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని మారుమూల పల్లెలు, గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పర్యటించి పార్టీ బలోపేతానికి చేయాల్సిన కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, మంగపతినాయక్, మోర మహేందర్, జగదీశ్వర్, రాజు, సామ సుధాకర్‌రెడ్డి, సైదులు, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బద్రీ

బడంగ్‌పేట్: సిమెంట్ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బద్రీ తెలిపారు. మంగళవారం బడంగ్‌పేట్‌లోని శ్రీనివాస స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లోని దుకాణంలో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని తెలిపారు. కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. విచ్చేసిన తాపీ మేస్త్రీలకు ఆయన లక్ష రూపాయల ప్రమాదబీమా కార్డులను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ మాసయ్య, భారతి సిమెంట్ బృందం, 50 మందికిపైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



ప్రమాద బీమా కార్డులతో పాటు బహుమతులు అందజేస్తున్న భారతి సిమెంట్ ఇంజనీర్లు

మహిళలకు చీరల పంపిణీ

ఆమనగల్లు: పట్టణంలో మంగళవారం టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డిని అభిమానులు గజమాలతో సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మానయ్య, రాజశేఖర్, సత్యం, రాఘవేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆమనగల్లు: తలకొండపల్లి యాదవసంఘం అధ్యక్షుడిగా రవీందర్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన యాదవ సంఘం సమావేశంలో మాజీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా రవీందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్, కార్యదర్శిగా మల్లేశ్, సభ్యులుగా వెంకటేశ్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మహేశ్, వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు.

శ్రీరామ నవమిపై సమీక్ష

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై వివిధ నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే నెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. అనంతరం సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. సమావేశంలో యాదగిరి, వెంకటయ్య, రాములు, యాదయ్య, రవీందర్, రమేశ్, ఆంజనేయులుయాదవ్, పరమేశ్‌గౌడ్, గోపాలకృష్ణ, పూజారి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి?

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

బడంగ్‌పేట్: నిరుద్యోగులను కేంద్ర ప్రభుత్వం దగా చేస్తుందని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఉద్యోగాల విషయంపై కార్పొరేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిగురింత దయాసాగర్‌రెడ్డి, మహేశ్వరం అధ్యక్షుడు సుభాన్ యాదవ్, మండల అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దోచిపెడుతూ, కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సందీప్‌రెడ్డి, బాలాపూర్ మండల అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మరాఠీ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



శివసేనారెడ్డితో బడంగ్‌పేట యూత్ కాంగ్రెస్ నాయకులు

మసీద్ నిర్మాణ పనులు ప్రారంభం

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దర్గా వద్ద మసీద్ నిర్మాణ పనులను మత పెద్దలు ఎండీ రషీద్, ఎండీ మదర్‌సాబ్, ఎండీ జహంగీర్ ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కె.శ్రీశైలం, చెన్నయ్య, తామస్ రెడ్డి, డి.శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



మసీద్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ముస్లిం మత పెద్దలు